సూర్య
నేటి దినపత్రిక
18వ వసంతం
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
శుక్రవారం,6 డిసెంబర్ 2024
8 పేజీలు


## 65 మందికి 64 మంది ఓటు హక్కు వినియోగం




**పెదవేగి,మేజర్ న్యూస్:** ఉపాధ్యాయు సమ్మెల్సీ ఎన్నికల్లో పెదవేగి మండలంలో 64 మంది ఉపాధ్యాయులు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 65మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా వారిలో 64 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. అందులో 38మంది పురుషఓటర్లకు గాను 37మంది ఓటువేశారు.అలాగే 27మంది మహిళా ఓటర్ల నూరుశాతం ఓటుహక్కు వినియోగించుకున్నారు. వైతహసీల్దారు. ఎన్నికల అధికారి ఎస్ భ్రమరాంబ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు.

### ప్రశాంతంగా ముగిసిన

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్

**- 20 కేంద్రాలలో 91.60 శాతం నమోదు - పలు ప్రాంతాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి**





**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఏలూరు జిల్లాలో ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. గురువారం ఏలూరు కోట దిబ్బలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ,చాటపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ కె.వెట్రిసెల్వి సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 20 పోలింగ్ కేంద్రాలలో ఉదయం 8 గంటల నుండి ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ సాగిందన్నారు. జిల్లాలో మొత్తం 2,667 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వారిలో 2,443 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా, వీరిలో 1387 మంది పురుషులు 1056 మంది మహిళలు ఉన్నారన్నారు.జిల్లాలో ఓటు హక్కు కలిగిన ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకున్నారు. జిల్లాలో సాయంత్రం నాలుగు గంటల వరకు 91.60 శాతంపోలింగ్ నమోదైనట్టు జిల్లాకలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఓటింగ్ సరళిని పర్యవేక్షించేందుకు ఏలూరు కలెక్టరేట్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పూర్తి బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం ఓటింగ్ సరళిని పర్యవేక్షించడం జరిగింది. పోలింగ్ కేంద్రాలు సందర్శించిన జిల్లా కలెక్టర్ బ్యాలెట్ బాక్స్ లకు వేసిన సీళ్ల ను పరిశీలించారు .పోలింగ్ సరళిని పరిశీలించి అక్కడ ఏర్పాట్లపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్లకు సహాయకారిగా ఉండేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద హెల్ప్ డస్కులను కూడా ఏర్పాటు చేశామని,అదేవిధంగా ప్రధమ చికిత్స కేంద్రాలను కూడా ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. సంబంధిత జిల్లా అధికారులు, పోలీసు శాఖ అధికారులు,సిబ్బంది,ఎన్నికల అధికారులు,సిబ్బంది సమిష్టి కృషితో జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబారిష్ తదితరులు ఉన్నారు.



## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 93.27 శాతం పోలింగ్

### : జిల్లా కలెక్టర్

**భీమవరం/వీరవాసరం,మేజర్‌న్యూస్:** పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ సరళి ఈ విధంగా ఉంది జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య : 3,729 ఓటు హక్కును వినియోగించుకున్న వారి సంఖ్య: 3,478 పోల్ పర్సంటేజ్: 93.27 శాతం. అంతకు ముందు వీరవాసరం యం ఆర్ కె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటుచేసిన ఉమ్మడితూర్పు పశ్చివ ంగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 108-పోలింగు కేంద్రాన్ని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎన్ని ఓట్లు పోల్ అయ్యాయి, ఇంకా ఎన్ని ఓట్లు ఉన్నాయని కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. పురుషులు ఓట్లు 86, మహిళల ఓట్లు 43 మొత్తం 129 ఓట్లు ఉన్నాయని ఇప్పటివరకు 21 శాతం ఓట్లు నమోదు అయ్యాయని అధికారులు జిల్లా కలెక్టరుకు వివరించారు. ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి, ఉన్న మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా

- తరువాయి 2లో..

## ఆత్మ హత్యాయత్నం నుండి కాపాడిన 112 కాల్

**- వెంటనే స్పందించి యువతిని రక్షించిన ఏలూరు టూ టౌన్ పోలీసులు**

**ఏలూరు, మేజర్‌న్యూస్:** ఏలూరు టూ టౌన్ సిబ్బంది 112 కాల్‌కు సకాలంలో స్పందించడం వలన ఒక వివాహితను ఆత్మహత్య ప్రయత్నము నుండి కాపాడిన ఘటన ఇక్కడ చోటు చేసుకుంది.5వ తేదీ రాత్రి 7:36 కి అన్నవరం గ్రామం నుండి వెంకటేష్ అనే వ్యక్తి 112 కి కాల్ చేసి అతని భార్య బత్తుల త్రివేణి తనతో గొడవపడి మధ్యాహ్నం ఇంట్లో నుండి వెళ్ళిపోయి ఏలూరు ఓల్డ్ బస్ స్టాండ్ నుండి అతనికి ఫోన్ చేసి ఆమె ఆత్మహత్య చేసుకుని చచ్చిపోతాను అని చెప్పినట్లు తెలిపాడు.ఈ విషయాన్నీ ఏలూరు జిల్లా 112 కంట్రోల్ కి చెప్పాడు. ఈ సమాచారాన్ని ఏలూరు కంట్రోల్ రూమ్ సిబ్బంది ఏలూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్ (పీసీ -1684) సమాచారం తెలియ చేసిన వెంటనే పోలీస్ కానిస్టేబుళ్లు 2374,193 అనువారు పాత బస్టాండ్ ఏరియాకి వెళ్లి ఆమెను



వెతికి పోలీస్ స్టేషన్‌కి తీసుకొనివచ్చి పోలీస్ అధికారులు ఆమెకు కౌన్సిలింగ్ఇచ్చితన బంధువులకు అప్పగించారు. దీనిపై ఆ వివాహిత మహిళ రక్త బంధువులు పోలీసులు సకాలంలో స్పందించి ఆమెను కాపాడినందుకు కృతజ్ఞతలు తెలియ చేశారు.

### రూ.5.65 లక్షల కోట్ల అంచనాతో

## 145 గ్రీన్,బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టులకు అనుమతి

**- కేంద్ర పెట్రోలియం,నేచురల్ గ్యాస్ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి వెల్లడి**

**దిల్లీ/ ఏలూరు,సూర్య బ్యూరో :** కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లు, అంత కంటే ఎక్కువ ఖర్చుతో రూ. 5.65 లక్షల కోట్ల అంచనా వ్యయంతో 145 ప్రాజెక్టులను ఆమోదించిందని, వీటిలో రూ.2.84 లక్షల కోట్ల వ్యయంతో 78 నూతన గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు, రూ.2.81 లక్షల కోట్ల వ్యయంతో 67 బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నట్లు కేంద్ర పెట్రోలియం,నేచురల్ గ్యాస్ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి ప్రకటించారు.దేశంలో ఆయిల్, నేచురల్ గ్యాస్ కంపెనీల ద్వారా గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేసిందని, ప్రాజెక్ట్‌ల ఏర్పాటుకు అనుమతులు,ప్రాజెక్టుల స్థాపనలో నిబంధనలను ఉల్లంఘిస్తున్న కంపెనీలను గుర్తించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై పార్లమెంట్ లో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడారు.



గురువారం లోక్ సభలో అడిగిన ప్రశ్నకు మంత్రి హర్దీప్ సింగ్ పూరి లిఖిత పూర్వకంగా బదులిచ్చారు. 2014 నుండి రూ.4.86 లక్షల కోట్ల అంచనా వ్యయంతో రూ.100 కోట్లు, అంతకంటే ఎక్కువ వ్యయంతో మొత్తం 379

- తరువాయి 2లో..

# వసతి గృహాల్లోని 10వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



**భీమవరం,మేజర్‌న్యూస్:** స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి గురువారం సంయుక్తంగా జిల్లాలోని ఎస్సీ,బిసి వసతి గృహాల 10వ తరగతి విద్యార్థులతో గూగుల్ మీట్ ద్వారా సమావేశమయ్యారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వసతి గృహాల విద్యార్థులు చదువులో మెటిగా నిలవాలని, అత్యధిక మార్కులతో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. జిల్లాలోని ఏడు సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో 44 మంది, 13 వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాల్లో 110 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలను వ్రాయనున్నారు. ఈ సందర్భంగా వారిలో స్ఫూర్తిని నింపేందుకు ప్రత్యేక గూగుల్ మీట్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్ నుండి ఏర్పాటు చేసి విద్యార్థులతో మాట్లాడడం జరిగింది.వసతి గృహాలలో విద్యుత్‌కు అంతరాయం లేకుండా ఇన్వర్టర్లు, స్వచ్ఛమైన డ్రింకింగ్ వాటర్ సౌకర్యం, అవసరమైన చోట్ల నూతన టాయిలెట్స్ నిర్మాణాలు, తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తాను 10వ తరగతి సీబీఎస్ఈ సిలబస్‌లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సాహంతో స్కూలు మొదటి స్థానాన్ని సంపాదించానని ఈ సందర్భంగా వెల్లడించారు. గూగుల్ మీట్ లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా బీసీసంక్షేమ శాఖ అధికారి గణపతి రావు పాల్గొన్నారు.

## పి.డి.యస్.యు.నుండి క్రాంతి కుమార్ బహిష్కరణ




**ఏలూరు,మేజర్‌న్యూస్ :** విప్లవ విద్యార్థి సంఘమైన పి.డి.యస్.యు. క్రమశిక్షణకు,నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకుగాను జిల్లా సహాయ కార్యదర్శిగావున్న ఎం.క్రాంతికుమార్‌ను పి.డి.యస్.యు.నుండి బహిష్కరించినట్లు జిల్లా అధ్యక్షులు కె.నాని, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మహర్షి తెలియజేశారు. పిడియస్‌యు విద్యార్థి సంఘం ఒక విప్లవకర, చరిత్ర కలిగిన విద్యార్థి సంఘమనీ, ఇందులో సమిష్టి నిర్ణయాలతో విద్యార్థుల సమస్యలపై ముందుకు వెళ్లడం జరుగుతుందనీ అలాకాకుండా వాటికి వ్యతిరేకంగా వ్యక్తిగత ఏజెండాతో పని చేస్తున్న యం.క్రాంతి కుమార్‌కి ఇది సరైంది కాదనీ, సరి చేసుకోమని పలుమార్లు చెప్పడం జరిగిందని నాయకులు తెలిపారు. అయినప్పటికీ పిడియస్‌యు విద్యార్థి సంఘంలో పనిచేస్తూ సంఘం నిబంధనావళికి భిన్నంగా ఇతర సంఘాలతో రహస్య సంబంధాలు కొనసాగిస్తూ సంఘం విచ్ఛిన్నానికి ప్రయత్నం చేస్తున్నందున వివరణ కోరామనీ అనంతరం బహ్కిరించామని వివరించారు.

## గుంజిళ్ళు తీయించిన ఉపాధ్యాయులు - అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరిన బాలిక



**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** బుట్టాయిగూడెం మండలం ఇప్పలపాడు ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యార్థిని కి అస్వస్థత ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. యోగా క్లాసుకి రాలేదని జ్వరంతో ఉన్న విద్యార్థినితో గుంజిళ్ళు తీయించిన ఉపాధ్యాయులు. గుంజిళ్ళు కారణంగా తీవ్ర అస్వస్థతకు గురైన బాలికను బుట్టాయిగూడెం ఆసుపత్రి చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్న బాలిక స్కూల్‌లో పరిస్థితి బాగోలేదని విద్యార్థులతో మరుగుదొడ్లు,అన్నం గిన్నెలు కడిగిస్తున్నారని బాలిక తెలిపింది. అదే విధంగా మధ్యాహ్నం వండిన భోజనం రాత్రి ,రాత్రి వండిన భోజనం మరుసటి రోజు పెడుతున్నారని తెలిపిన విద్యార్థిని తల్లిదండ్రులకి విషయం చెపితే విద్యార్థులను కొడుతున్నారని ఆరోపించింది.

## న్యాయ సేవా కార్యకర్తలుగా శిక్షణ పొందుటకు దరఖాస్తులు స్వీకరణ

**నరసాపురం,మేజర్‌న్యూస్:** ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ,ఏలూరివారి ఆదేశాల మేరకు నర్సాపురం మండల న్యాయ సేవాదికార సంస్థ లో స్వచ్ఛంద న్యాయ సేవా కార్యకర్తలుగా శిక్షణ పొందుటకు 10వ తరగతి కనీస విద్యార్హత కలిగి, ఎటువంటి ధనార్జన ఆశించకుండా, సేవా దృక్పథం కలిగి ఉండి, ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందించుటకు, ఆసక్తి కలిగిన వ్యక్తులనుండి దరఖాస్తులు స్వీకరిస్తామని పదవ జిల్లా అదనపు న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికారి సంస్థఅధ్యక్షురాలు,పి విజయ దుర్గ తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. నర్సాపురం,యలమంచిలి, మొగల్తూరు మండలాల పరిధిలో ఉన్న విశ్రాంత ఉద్యోగులు,లా విద్యార్థులు, అంగన్వాడీ వర్కర్స్, ఎం.ఎస్.డబ్ల్యు విద్యార్థులు, సోషల్ వర్కర్స్, వైద్యులు, రాజకీయేతర సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, డ్వాక్రా మహిళలు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తుల కొరకు నర్సాపురం కోర్ట్ ప్రాంగణంలో ఉన్న మండల న్యాయ సేవాధికార సంస్థ వారిని సంప్రదించి, ఈ నెల 11వ తేదీ లోపు తమ దరఖాస్తులను అందజేయవలసిందిగా ఆమె తెలిపారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలో 94. 5శాతం పోలింగ్



**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి గురువారం జరిగిన ఎన్నికలు 94.5శాతం పోలింగ్ నమోదైనట్లు ఆర్డీవో దాసి రాజు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకే పోలింగ్ ముగిసినట్లు ఆయనవెల్లడించారు.డివిజన్ పరిధిలోని నరసాపురం, ఎలమంచిలి, మొగల్తూరు, పెనుగొండ, పెనుమంట్ర, ఆచంట తణుకు పోలింగ్ స్టేషన్ ల పరిధిలో ప్రశాంతంగా ఎన్నిక జరిగినట్లు ఆర్డీవో తెలిపారు. పోలింగ్ సరళిని వివిధ కేంద్రాలలో ఆర్డీవో పరిశీలించారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 93.27 శాతం పోలింగ్

మొదటిపేజి తరువాయి

జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచే ఓటర్లు పోలింగు కేంద్రాల వద్దకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని అన్నారు.ఈ సందర్భంలో తహాశీల్దారు ఏ.వి.రామాంజనేయులు,పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మి,పోలీసు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## రూ.5.65 లక్షల కోట్ల అంచనాతో 145 గ్రీన్,బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టులకు అనుమతి

మొదటిపేజి తరువాయి

ప్రాజెక్టులు పూర్తయ్యాయని,వీటిలో రూ.2.52 లక్షల కోట్ల వ్యయంతో కూడిన 225 గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టులు కాగా, రూ.2.34 లక్షల కోట్ల వ్యయంతో కూడిన 154 బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టులు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఆయిల్ అండ్ గ్యాస్ సిపిఎస్ ఇల ప్రాజెక్ట్‌ల అమలు స్థితిని అంచనా వేయడానికి పటిష్టమైన ఆన్‌లైన్ మానిటరింగ్ సిస్టమ్ కలిగి ఉందని,ఆన్‌లైన్ ప్రాజెక్ట్ మానిటరింగ్ పోర్టల్ (www.pariyojana.gov.in ద్వారా ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, ప్రాజెక్ట్‌లను సకాలంలో పూర్తి చేయడం కోసం ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని మంత్రి బదులిచ్చారు.

## ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి

: ఎమ్మెల్యే బడేటి చంటి



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ప్రజాసమస్యలకు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారాలు చూపుతున్నామని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) పేర్కొన్నారు. ఇదేక్రమంలో ఏలూరు పవర్ పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం గురువారం వినతులందించేందుకు వచ్చిన వారితో కిక్కిరిసింది. తనను కలిసేందుకు వచ్చిన ప్రతిఒక్కర్నీ ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే. నేనున్నానంటూ వారికి భరోసా కల్పించారు. అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే పలు సంఘాల నాయకులు నుండి వినతిపత్రాలు స్వీకరించారు,ఆలయాల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఆహ్వానాలను అందుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ప్రజా సమస్యలకు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారమార్గాలు చూపుతూ వస్తున్నామన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చునని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు వందనాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కృషితో ర్యాంకింగ్‌లలో పంచాయతీలు పరుగు

**కాకినాడ,మేజర్‌న్యూస్ :**దేశ ప్రజాస్వామిక మనుగడ పంచాయతీ వ్యవస్థ పనితీరనిగుర్తించిఆదిశగా ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషికి నేడు పంచాయతీరాజ్ వ్యవస్థ ర్యాంకింగ్‌లో పరుగు పెడుతుందని మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. స్థానిక స్వపరిపాలన, ఆర్థిక వృద్ధికి శక్తివంతమైన కేంద్రాలుగా పంచాయతీరాజ్ సంస్థలను పునర్మించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్'ను ఏర్పాటు చేసిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగాఈ కేంద్ర ప్రాయోజిత పథకాన్ని నాలుగు సంవత్సరాల పాటు అమలు చేస్తుందని అన్నారు.

# ఛాంబర్స్ కళాశాలకు ఎన్‌సిసి నావెల్ యూనిట్ మంజూరు




**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** స్థానిక బిఆర్‌ఆర్ అండ్ జికేఆర్ చాంబర్స్ డిగ్రీ ,పీజీ కళాశాలకు ఎన్‌సిసి నావెల్ యూనిట్ మంజూరు చేయబడిందని ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎన్‌సిసి 7ఏ నావెల్ యూనిట్, వైఎన్‌ఎం కాలేజ్, నరసాపురం ఇన్చార్జ్ కమాండ్ ఆఫీసర్ సంజిత్ రౌత్రాయ్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఎన్సిసిపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథి కమాండ్ ఆఫీసర్ సంజిత్ రౌత్రాయ్ మాట్లాడుతూ ఎన్సిసిలో చేరిన విద్యార్థులకు శారీరక సౌష్టవం,క్రమశిక్షణ,దేశభక్తి, దేశ ఐక్యత పెం పొందుతాయని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో అనగా ఆర్మీ పోలీస్ ఉద్యోగాలలో,ఉన్నత చదువులలో వీరికి ప్రాధాన్యత ఇవ్వబడునని బిఆర్‌ఆర్ అండ్ జీకే ఆర్ విద్యాసంస్థలకు సీనియర్ డివిజన్ యూనిట్ అనుమతించబడినదిని వచ్చే విద్యా సంవత్సరం మనకు మరొక డివిజన్‌ను అనుమతించుటకు సమచితంగా ఉన్నదని అన్నారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల చైర్మన్ కె.వి.ఆర్ నరసింహారావు మాట్లాడుతూ ఎన్సిసి నావెల్ యూనిట్ మన కళాశాలకు మంజూరు చేసినందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తి, మంచి నడవడిక,ఆత్మస్థైర్యం, నేటి యువతలో కొరవడినాయని,ఎన్సిసి వంటి సామాజిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో దేశభక్తిని ఆత్మస్థైర్యాన్ని కలిగించ వచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమానికి పిఓ సిబ్బంది నాగబాబు,పంకజ్ శర్మ దుర్గారావు, రాము, కళాశాల అకాడమిక్ అడ్వైజర్ ఎన్. సీతారామారావు, ఛాంబర్స్ కళాశాల ఎన్సిసి కేర్ టేకర్ రవికృష్ణ, ఆంగ్ల అధ్యాపకులు రాజభూషణం, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు,

# ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు పర్యవేక్షించిన డిఎస్‌పి



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో స్థానిక జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు పర్యవేక్షించిన ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు వారు విధి నిర్వహణలో ఓటు వినియోగించుకునే వారిపట్ల మర్యాదపూర్వకంగా నడుచుకుం టూ ఓటు వినియోగించుకునేలాగా అన్ని రకాల సౌకర్యాలను, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ సిబ్బంది చేయ వలసిన పనులు చేయకూడని పనులు గురించి అధికారులకు తెలిపారు. పోలింగ్ సక్రమముగా జరిగేలాగా పర్యవేక్షించిన డిఎస్‌పి. శ్రావణ్ కుమార్‌తో పాటుగా ఎస్.బి ఇన్స్పెక్టర్ ఆది ప్రసాద్,ఏలూరు వన్ టౌన్ ఎస్ఐ మదీనా భాషా ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# భవిత కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి



**ఏలూరు,మేజర్ న్యూస్:** భవిత కేంద్రంలోని బాలబాలికలకు ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరపీ వంటివి వాటిలో చక్కగా శిక్షణ అందించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక అశోక్ నగర్‌లోని అశోకవర్ధని పాఠశాలలోని భవిత (ప్రత్యేక అవసరాల బాల బాలికల జిల్లా వనరుల కేంద్రం) కేంద్రం ను కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల బాల బాలికలకు ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరపీ వంటివి వాటిలో శిక్షణ అందించి ఇతర పిల్లలతో సమానంగా విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవా లన్నారు. ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరపీకి సంబంధించిన పరికరాలు అందిస్తానని కలెక్టర్ చెప్పారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖాధికారి వెంకట లక్ష్మమ్మ, నగరపాలక సంస్థ ఉప కమీషనర్ చంద్రయ్య, ఎంఈఓలురంగారావు,రవిప్రకాష్,పాఠశాల ప్రధానోపాధ్యాయ ులు కె.శ్రీహరి, భవిత కేంద్రం కోఆర్డినేటర్ బి.భాస్కరరాజు, శిక్షకురాలు జి.శ్యామల, ప్రభృతులు ఉన్నారు.

# శాఖా గ్రంధాలయానికి పుస్తకాలు బహూకరణ



**నరసాపురం, మేజర్ న్యూస్ :** ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయమునకు రిటైర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పెచ్చెట్టి దేవేంద్రరావు పోటీపరీక్షలకు ఉపయోగపడే ఏపీపీఎస్సీ గ్రూప్ వన్ మెయిన్స్ ప్లానర్ ,జనరల్ ఎస్సేస్,ఏపీపీ ఎస్సీ గ్రూప్ 2 బుక్స్ విరాళంగా అందజేశారు. వారి తల్లితండ్రులు కీ.శే.లుపేచెట్టి శ్రీరాములు,తులసీ రత్నం ల,జ్ఞాపకార్థం గ్రంథాలయమునకు బహుకరించారు. ఈపుస్తకాలు పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్ననిరుద్యోగులకు ఉపయోగపడతాయని వారన్నారు.గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కె జె ఎస్ ఎల్ కుమారి వారికి కృజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలోజి. రవీంద్రరాజు ఉపాధ్యాయులు, గ్రంథాలయ పాఠకులు శ్రీనివాస్,హరిబాబు, వెంకట్,సతీష్ సంధ్య,జ్యోతి, మౌనిక, దుర్గ తదితరులు పాల్గొన్నారు .

# భీమడోలులో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

: పర్యవేక్షించిన సిఐ విల్సన్



**భీమడోలు,మేజర్ న్యూస్:** సర్కిల్ పరిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు, పటిష్ట బందోబస్త్ మధ్య ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని భీమడోలు సిఐ విల్సన్ అన్నారు. గురువారం భీమడోలు మండలానికి సంబందించి భీమడోలు-1 ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళిని సిఐ పరిశీలించి, అధికారులు పలు సూచనలు చేసారు. గతేడాది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కారణంగా జరుగుతున్న తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉపఎన్నిక బరిలో ఐదుగురు అభ్యర్థులు పోటీపడుతున్నారు. మండలంలో 91 మంది ఓటర్లు తమ ఓటు హక్కును ఉదయం 8గంటల నుంచి బ్యాలెట్ పద్ధతిలో వినియోగించు కుంటున్నారు. భీమడోలు పోలింగ్ కేంద్రంలో ప్రీసైడింగ్ అధికారిగా తహసీల్దార్ బి.రమాదేవి వ్యవహరించారు.

# నవరసపురంలో ప్రపంచ నేల దినోత్సవం



**నర్సాపురంరూరల్,మేజర్ న్యూస్:** మండలంలోని నవరసపురంలో ప్రపంచ నేల దినోత్సవం కృషి విజ్ఞాన కేంద్రం చే నిర్వహించ బడింది. ఈ కార్యక్రమంలో ఏ డి ఈ ఇ.అనిల్ కుమారి మట్లాడుతూ రైతులు భూమిలో పచ్చిరొట్ట పంటలను వేసి,పెంచి, కలియదున్నలని పంట కోత అనంతరం అవశేషాలను కుల్లిబెట్టాలని రైతులకి సూచించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ డెమోన్నియానా రైతుకు భూసారం పెంపొందిచడంలో మేలుకువలు భూసార పరీక్షల ఆవశ్యకత గురించి వివరించారు. మత్స్యభాగ శాస్త్రవేత్త డాక్టర్ ఏ శ్రీనివాసరావు మట్లాడుతూ చేపలు రొయ్యల చెరువుల యాజమానం కు మట్టి పరీక్ష ప్రముక్యతని రైతులు తప్పని సరిగ చెరువులు ఎండగట్టినపుడు మట్టి పరీక్ష చేయించు కోవాలన్నారు. డా:పి.వినయ లక్ష్మి పంటల విభాగ శాస్త్రవేత్త ఈ కార్యక్రమంలో పంటల విభాగ శాస్త్రవేత్త డాక్టర్ వినయ లక్ష్మి,ఎ.ఇ.ఓ. లక్ష్మీ నారాయణ, వి.ఎ.ఎ. సుధారాణి, ఉష,జ్యోతి,రైతులు పాల్గొన్నారు.

# రోగుల కోసం దుప్పట్లు పంపిణీ చేసిన విలేఖరి రామకృష్ణ

**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్:** మానవసేవే మాధవ సేవ అంటారు పెద్దలు తనకున్న దానిలో ఎదుటివారికి సహాయం చేసే వ్యక్తిని భగవంతుడితో పోలుస్తుంటారు ఆ కోవకు చెందిన వ్యక్తి ఏబీఎన్ ఆంధ్రజ్యోతి విలేకరి పాలడుగుల రామకృష్ణ. మండలంలోని జీలుగుమిల్లి, కామయ్యపాలెం, రాచన్న గూడెం ప్రభుత్వ ఆసుపత్రులకు పాలడుగుల రామకృష్ణ తన దాతృత్వాన్ని చాటుతూ ఆసుపత్రికి వచ్చే రోగుల కోసం ఉపయోగించేందుకు బెడ్ షీట్లును వైద్యులకు అందజేశారు. ఒక్కో ఆసుపత్రికి 20 బెడ్ షీట్లు చొప్పున అందించారు. ఓ ఛానల్ విలేకరిగా కుటుంబాన్ని పోషించుకుంటూ తనకున్న దానిలో సమాజ సేవకు ఉపయోగిస్తూ ఎందరికో వారి అవసరాలు తెలుసుకుని అవసరం ఉన్న వస్తువులను అందిస్తూ వస్తున్నారు. గతంలో జీలుగుమిల్లి ప్రభుత్వ ఆసుపత్రికి రోగులు కూర్చునేందుకు ఫర్నిచర్, వాషింగ్ మిషన్, రోగుల గదికి ఏసి నీ అమర్చారు వీటన్నిటిని ఒక దాత అందించేలా కృషి చేశారు.అలా ఆ విలేఖరి నిత్యం సమాజ సేవకు కృషి చేస్తూ ఉంటున్నారు. ప్రతి ఒక్కరు సమాజం పట్ల సేవాభావం కలిగి ఉండాలని ఈ సందర్భంగా పాలడుగుల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.అనంతరం జీలుగుమిల్లి, కామయ్యపాలెం, రాచన్నగూడెం ఆసుపత్రి వైద్యులు డా.గాయత్రి, డా.హేమలత,డా.దివ్య,



డా.మణికంఠేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్ట్ పాలడుగుల రామకృష్ణ ఆసుపత్రి రోగుల కోసం బెడ్ షీట్లు ఉచితంగా అందించడం హర్షణీయం అనికొనియాడారు.ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ నాగేశ్వరరావు, పిఆదిలక్ష్మి, కేజీయా, మంగయమ్మ, వెంకట్, కే ప్రసాద్. పాత్రికేయులు కొప్పుల కృష్ణమోహన్, బొంతు రామకృష్ణ,యు ప్రసాద్, జెట్టి రామకృష్ణ,ధారా మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# టీచర్‌గా మారిన కలెక్టర్






– పవర్ పేట ఎంపియుపి స్కూల్ ఆకస్మిక తనిఖీ

– ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన భేష్ : జిల్లా కలెక్టర్

ఏలూరు,మేజర్‌న్యూస్ : కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయి మెరుగుపడుతున్నదని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక పవర్ పేట లోని పవర్ పేట ఎంపి యు పి స్కూల్ ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులను ఇంగ్లీష్, గణితంలో ప్రశ్నలను అడిగి,మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి పాఠశాలలోని 3వ తరగతి పిల్లలతో మమేకమై కాస్సేపు ఉపాధ్యాయురాలిగా మారిపోయారు. విద్యార్థులకు పాఠాలు చెప్పారు. వారితో సరదాగా గడిపారు. బ్లాక్ బోర్డు పై ఇంగ్లీష్ పదాలు ఇచ్చి వాటిని కరెక్ట్‌గా పలకమన్నారు. అనంతరం గణితం సబ్జెక్టులో కొన్ని లెక్కలు ఇచ్చి వాటిని పరిష్కరించమన్నారు.వెంటనే విద్యార్థులు తాము చెబుతామంటే తాము చెబుతామని, పోటాపోటీగా వచ్చి ఇంగ్లీష్ పదాలు పలికారు. గణితంలో ఇచ్చిన హెచ్చివేతలు,భాగాహారాలనుకూడా విద్యార్థులు వెంటనేపరిష్కరించేసరికి కలెక్టర్ఆశ్చర్యపోయి ఉపాధ్యాయుల ను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మంచి ఉపాధ్యా యులను తాను ఎప్పుడూ ప్రోత్సహిస్తానని,అదే సమయంలో అలసత్వంతో ఉండే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటానన్నారు. తాను జిల్లాలో వివిధ కార్యక్రమాలలో పాల్గొనే క్రమంలో ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మి కంగా తనిఖీ చేస్తానని,ఎక్కడైనా ఉపాధ్యాయులతో అలసత్వం, మధ్యాహ్న భోజన నాణ్యతలో లోపాలుఉంటె వెంటనేచర్యలు తీసుకుంటా నన్నారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖాధికారి వెంకట లక్ష్మమ్మ, నగర పాలక సంస్థ ఉపకమీషనర్ చంద్రయ్య, ఎంఈఓ లు రంగారావు, రవి ప్రకాష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. శ్రీహరి, ప్రభృతులు ఉన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు ఆటలు,పాటలు నేర్పించాలి

– ఐసిడిఎస్ సిబ్బందికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశం

**ఏలూరు,మేజర్‌న్యూస్:** అంగన్వాడీ కేంద్రాలలో సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అంగన్వాడీ సిబ్బంది ని ఆదేశించారు స్థానిక పవర్ పేట బలుసు వారివీధిలోని 32వ నెంబర్ అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలు అక్షరాలు సరిగ్గాత్ పలకలేకపోవడంతో అంగన్వాడీ కేంద్రం సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. అంగన్వాడీ కేంద్రాలు గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించడంతోపాటు,పిల్లలకు ప్రీ స్కూల్‌గా ఉండాలన్నారు. అంగన్వాడీకి వచ్చే చిన్నపిల్లలకు ఆటలు,పాటలు,మాటలు,చిన్న చిన్న పదాలు, నేర్పడంతోపాటు పిల్లల్లో సృజనాత్మకత, నైపుణ్యాలు పెంపొందే విధంగా వివిధ కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లే సమయానికి విద్య పట్ల ఆసక్తి పెంపొందేలా అంగన్వాడీ సిబ్బంది పనిచేయాలన్నారు.ఈ అంశాలపై ఐసిడిఎస్ ప్రత్యేక కార్యక్రమాలను నిర్దేశించిందన్నారు. సదరు ప్రణాళిక ప్రకారం వాటిని అంగన్వాడీ సిబ్బంది తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలలో అమలు చేయాల్సి ఉంద న్నారు. ఇకనుండి సిబ్బంది ఆ దిశగా పనిచేయాలని కలెక్టర్ అంగన్వాడీ సిబ్బందిని ఆదేశించారు. ఐసిడి ఎస్ సూపర్వైజర్ మౌనిక, అంగన్వాడీ సహాయకులు మణి , ప్రభృతులు పాల్గొన్నారు.



# మండలంలో రూ.6.37 కోట్లతో 84 సీసీ రోడ్లు నిర్మాణం

– వాటర్ క్యూరింగ్ జరగక పోవడంతో తెల్లగా మారిన రోడ్డు



కొయ్యలగూడెం,మేజర్‌న్యూస్:కొయ్యలగూడెం మండలంలో రూ.6.37 కోట్లతో 84 గ్రామాల్లో సిమెంటు రోడ్లు గ్రామీణాభివృద్ధి శాఖ మంజూరు చేసిందని, మండల పంచాయతీ ఏ.ఈ., జి.సురేష్ మేజర్‌న్యూస్‌కు చెప్పారు. ఈ84 రోడ్లు వివిధ గ్రామాల్లో 13 కిలోమీటర్ల పొడవు ఉంటుందన్నారు. ఇప్పటి వరకూ 16 సిమెంటు రోడ్లు నిర్మాణం పూర్తి అయ్యిందని, వీటినిడివి 4.5కిలోమీటర్లు ఉంటుందని ఆయన వివరించారు. మంజూరైన మొత్తంపనులు ఈ నెలాఖరుకు పూర్తవుతాయని ఆయన చెప్పారు.

కాగా, కొయ్యలగూడెంలో జంగారెడ్డిగూడెం వైపు రోడ్డును ఆనుకుని ఉన్న వెంకటలక్ష్మి హోటల్ వద్ద నుంచి చేపలపేట మీదుగా మల్లోలు పొలాల దగ్గర నిర్మాణం జరుగుతున్న బలహీన వర్గాల నివాస సముదాయం వరకూ 260 మీటర్ల పొడవున రహదారి నిర్మించడానికి రూ.12 లక్షలు మంజూరయ్యాయని ఆయన చెప్పారు. కొయ్యలగూడెం మండలం పరింపూడి నుంచి కన్నాయగూడెం వరకూ, కన్నాయగూడెం దగ్గర పొంగుటూరు-యర్నగూడెం రోడ్ వరకూ ఉన్న పుంతరోడ్డు (ఆచార్య వినోభావే రోడ్డు) 4.5కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి చేయడానికి జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.90లక్షలు అంచనా వ్యయంతో మంజూరు కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు ఏ.ఈ. వివరించారు.

**– సీసీ రోడ్ల నిర్మాణంపై ఫిర్యాదులపై ఏ.ఈ.స్పందన**

–మండలంలోని కన్నాపురం తదితర కొన్ని గ్రామాల్లో నిర్మిస్తున్న సిమెంటు రహదారులు నాణ్యత విషయంలోనూ,నిర్మించిన రహదారులపై వాటర్ క్యూరింగ్ చేయడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారని,వాటర్ క్యూరింగ్ అసలు జరగడంలేదని వస్తున్న ఫిర్యాదులను మేజర్‌న్యూస్ ఆయన దృష్టికి తీసుకువెళ్లగా, ఈ విషయమై కాంట్రాక్టర్లతో ఇప్పటికే మాట్లాడి సూచనలు చేసినట్లు ఏ.ఈ. చెప్పారు. సీసీ రోడ్ల నిర్మాణం జరిగిన తరువాత కనీసం మూడు రోజుల వరకూ వాటిపై వాటర్ క్యూరింగ్ కోసం ట్రాక్టర్ ట్యాంకర్లు నడిపితే, రోడ్లపై గాళ్లు ఏర్పడతాయని, రోడ్డు నిర్మాణం అయిన మూడురోజుల తరువాత వాటర్ ట్యాంకర్లు నడిపి క్యూరింగ్ చేస్తే, రోడ్డు పటిష్టంగా ఉంటుందని ఆయన చెప్పారు. రేపటి నుంచే కాంట్రాక్టర్లు రోడ్లపై వాటర్‌క్యూరింగ్ చేపట్టాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన చెప్పారు.

## ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** స్థానిక వి.ఆర్.ఎం.వి మున్సిపల్ హైస్కూల్ నందు ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం జరిగాయి, 113 పోలింగ్ కేంద్రంలో నిర్వహించారు, పాలకొల్లు పరిధిలో ఉపాధ్యాయ ఓట్లు 480 ఉండగా 4 44 ఓట్లు పోలైనట్లు చెప్పారు, 92.50శాతం పోలింగ్ జరిగింది, ఎన్నికలను పాలకొల్లు తహసిల్దార్ ఎద్దు దుర్గా కిషోర్, నరసాపురం ఆర్డీవో దాసిరాజు పర్యవేక్షించారు, 100 మీటర్ల దూరంలో అభ్యర్థులు శిబిరాలు నిర్వహించారు, పట్టణ సీఐ కోలా రజిని కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ ఎం. ఉమా మహేశ్వరరావు (శివాజీ) బందోబస్తు నిర్వహించారు, పోలింగ్ సరళిని రెండు గంటలకు ఓసారి ప్రకటించారు.

## ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం ఆకస్మిక తనిఖీ చేసిన జెసి



భీమవరం,మేజర్ న్యూస్: గురువారం స్థానిక యస్.హెచ్.బి. ఆర్.యం. ఉన్నత పాఠశాల రూమ్ నెంబరు 7లో ఏర్పాటు చేసిన ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ 106 పోలింగు కేంద్రాన్ని జిల్లా జాయింటు కలెక్టరు పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. హెల్ప్ డెస్క్, వైద్య శిబిరాన్ని పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ఇప్పటివరకు ఎన్ని ఓట్లు పోల్ అయ్యాయి,ఇంకా ఎన్ని ఓట్లు ఉన్నాయని జిల్లా జాయింటు కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. పురుషులు ఓట్లు 434, మహిళల ఓట్లు 325 మొత్తం 759 ఓట్లు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లుతో పోలింగు సజావుగా జరుగుతుందని తెలిపారు.జిల్లా జాయింటు కలెక్టరు వెంట ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి,తహశీల్దారు రావి రాంబాబు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పాకలు వేసిన కబ్జాదారులు పై చర్య

– మాలమహనాడు జాతీయ అధ్యక్షుడు మంగరాజు డిమాండ్



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్:** తాడేపల్లిగూడెం పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద దళిత సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. మాలమహనాడు జాతీయ అధ్యక్షుడు చీకట్ల మిల్లి మంగరాజు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, దళిత సంఘాలు ప్రతినిధులు సబ్ రిజిస్టర్ కార్యాలయం ఆవరణలో అక్రమంగా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసారని, పాకలు వేసుకుని లేఖర్లుగా చెలామణి అవుతూ ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని దోచుకొంటున్నారని ఆరోపించారు. దీని మీద హైకోర్టు పాకలను తీసివేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని అక్టోబర్ 8న ఉత్తర్వులు జారీచేసిన వాటిని పట్టించుకోకుండా యధావిధిగా లేఖర్లు చెలామణి అవుతున్నరన్నారు. అధికారులు వెంటనే స్పందించి పాకలు తీసివేసి ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ సుజనారావు, దళిత మహసభ నాయకులు తాడేపల్లి దావీదు, దర్శి చంద్రశేఖర్ మెరిపో నాగరాజు, రాపాక కృష్ణ, కంకిపాటి వెంకట్, మర్లపాటి రాజు, ఎర్ర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# 7న పండుగ వాతావరణంలో మెగా పేరెంట్స్ ,టీచర్స్ మీట్

– జిల్లాలోని 1788 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యాచరణ
– ప్రతి విద్యార్థుల తల్లిదండ్రులను సాదరంగా ఆహ్వానిస్తున్నాం



ఏలూరు,మేజర్‌న్యూస్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 7వ తేదీన అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే మెగా పేరెంట్స్ ,టీచర్స్ మీట్ పండుగ వాతావరణంలో నిర్వహించేందుకుప్రత్యేక కార్యాచరణ రూపొందించామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు.గురువారం సంబంధిత అధికారులతో మెగా పేరెంట్ టీచర్స్ కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాల నిర్వహించే పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశాలు విజయ వంతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి విజ్ఞప్తి చేశారు.ఇది తల్లి దండ్రుల,ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనమని పేర్కొంటూ పిల్లల చదువు, ఆరోగ్యం, భవిష్యత్తు కోసం చర్చ జరిగే ఈ కార్యక్రమాల్లో ఎటువంటి ఇతర ప్రమేయం ఉండకూడదని స్పష్టం చేసారు. తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలు, ఉపాధ్యాయులు స్నేహపూర్వక వాతావరణంలో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని గవర్నమెంట్ యజమానుల్లో గల పాఠశాలలో జరుగు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్కు మొత్తం 1788 పాఠశాలలో కమిటీలను ఏర్పాటు చేయడమైనదన్నారు. విద్యార్థులతో తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రములు తయారు చేసి పంపడం జరిగిందన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఐదు పాఠశాలలు గుర్తించి ఆ పాఠశాల నందు అందరి విద్యార్థులకు మెడికల్ టెస్టులు చేసి అర్‌బిఎస్‌కెపుస్తకములను విద్యార్థులకు ఇవ్వడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమానికి 1788 ప్రభుత్వ పాఠశాలకు సంబంధించి సాదారంగా ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వం నిర్దేశించిన బ్యాక్ డ్రాప్‌ను మాత్రమే వినియోగించాలని అధికారులకు సూచించారు.

# ఆర్‌టిసి బస్టాండ్‌ను పరిశీలించిన రీజినల్ చైర్మన్ అప్పలనాయుడు



ఏలూరు,మేజర్ న్యూస్: విజయవాడ రీజనల్ బోర్డు జోనల్ చైర్మన్‌గా పమాణస్వీకారం చేసిన తర్వాత మొదటిసారిగా ఏలూరు కొత్త బస్టాండ్‌ని రెడ్డి అప్పల నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏపీఎస్ ఆర్టీసీ నుండి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అంతేకాకుండా అన్ని బస్టాండ్ ప్రాంగణాల్లో మౌలిక వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ముందుగా ఏలూరులోని కొత్త బస్టాండులో ప్రయాణికులకు అందుతున్న మౌలిక సదుపాయాల గురించి ప్రజా రవాణా శాఖ అధికారి వరప్రసాద్‌తో కలిసి అనంతరం ప్రజా రవాణా శాఖ అధికారి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏలూరు జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సంక్రాంతి,శివరాత్రి తదితర పండుగలకు ఆర్టీసీ బస్సులను పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు రవాణా సౌకర్యంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగుచర్యలు చేపడుతున్నామన్నారు. జంగారెడ్డి గూడెం,చింతలపూడి ఏలూరు డిపోల నుండి తిరుమల తిరుపతికి ప్రత్యేక సర్వీసులు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అంతేకాకుండా తూర్పుగోదావరిలో ఉన్న వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న విధంగా ప్రత్యేక బస్సులు నడిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఏపీఎస్ఆర్టీసీలో 16వేల వరకు డ్రైవర్లు కండక్టర్లు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు ఆర్టీసీపరంగా అందించేందుకు ప్రభుత్వంతో చర్చించి మెరుగైనసేవలు అందించేందుకుకృషి చేస్తామన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించడంలో పిహెచ్‌సిలు ముందు ఉండాలి





వీరవాసరం,మేజర్‌న్యూస్: జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వీరవాసరం మండలం కొణితివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని,సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించారు. తొలుత పి.హెచ్.సిని సందర్శించిన సందర్భంలో ఓపివిభాగం ఆపరేషన్ థియేటర్, ప్రసూతి వార్డు, పురుషుల వార్డు, ఇంజక్షన్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఇంజక్షన్ రూమ్ నందు వున్న గర్భిణీ మాట్లాడుతూ బలమైన పౌష్టికాహారం తీసుకుంటే శిశువు మెదడు బాగా ఎదుగుతుందని, తెలివైన పిల్లలు పుడతారని అన్నారు.రక్తహీనత లేకుండా సరైన ఆహారం అందించాలని గర్భిణీకి తోడుగా వచ్చిన భర్త, అత్తతో తెలిపారు. ప్రసూతి వార్డు నందు ప్రస్తువానికి సిద్ధంగా ఉన్న మహిళతో మాట్లాడారు. వైద్యం బాగా చేస్తున్నారా, వైద్యులు అందుబాటులో ఉంటున్నారా, ఏమైనా ఇబ్బం దులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

ఈసందర్భంలో మెడికల్ అధికారితో మాట్లాడుతూ గర్భిణీలు, ప్రసూతి మహిళలలో రక్తహీనత లేకుండా తరచూ పరీక్షలు చేసి అవసరమైన మందులను అందించాలన్నారు.

– కొణితివాడ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన కలెక్టర్ –సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన సందర్భంలో అన్ని గదులను, పరిసరాలను నిశితంగా పరిశీలించారు. స్లాబ్ కు పెచ్చులు ఊడిన చోట చేసిన మరమత్తుల పటిష్టతపై జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ ప్రాంగణంలో కొంతమేర దెబ్బతిన్న ప్రహరీ గోడ నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం బాలికలతో మాట్లాడుతూ బాగా చదువుకుంటే ఉన్నత చదువులను చదవవచ్చునని, లేనిపక్షంలో తల్లిదండ్రులకు మీకు పెళ్లి ఆలోచన వస్తుందన్నారు.ఇటువంటి పరిస్థితిని ఎట్టి పరిస్థితుల్లో కల్పించు కోవద్దని అన్నారు. వసతి గృహం ఆవరణలో మొక్కలు నాటారు. వసతి గృహం ఆవరణలోని ఖాళీగా ఉన్న ప్రాంతంలో పూల మొక్కలను, కూర గాయల మొక్కలను నాటి మొక్కల పెంపకాన్ని అలవాటుగా చేసు కోవాలని బాలికలకు సూచించారు.వసతి గృహం ముందుభాగంలో అస్తవ్య స్తంగా ఉన్న డ్రైన్‌ను పరిశీలించి వెంటనే డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు తీసు కోవాలని తాహసిల్దార్‌ను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి,జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, వీరవాసరం తహసిల్దార్ ఏవి రామా ంజనేయులు, పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యు.నవనీత్, వసతి గృహ సంక్షేమ అధికారి కె.జ్యోతి, ఎ ఎస్ డబ్ల్యు ఓ భానుమణి, ఆర్.ఐ రూజ్ వెల్ట్, ఉన్నారు.

## జనవరి నాటికి సిసి రోడ్ల నిర్మాణం పూర్తి

– పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వెల్లడి



జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్: నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో నిర్మించ తలపెట్టిన సిసి రోడ్లు జనవరి నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు వెల్లడిం చారు. గురువారం మండలంలోని బర్రింకలపాడు గ్రామంలో సీసీ రోడ్లకు కాంక్రీట్ పనులను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి కరాటం సాయితో కలిసి ప్రారంభించారు. నియోజకవర్గం లో జనవరి నాటికి సీసీ రోడ్లు అన్ని పూర్తవుతాయాని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బూత్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



నర్సాపురం,మేజర్‌న్యూస్ : పట్టణ పరిధిలోని 17 నెంబర్ బూత్‌లో బూత్ కమిటీ ఎన్నికగురువారం జరిగింది.జరి అధ్యక్షులు గా గొర్ల శ్రీనివాసరావుని గొర్లప్రసాద్‌రావు ప్రతి పాదించగా రిటర్నింగ్ అధికారి దాసరి బాబి ఆమోదించటంతో అతని అభ్యర్థిత్వాన్ని ఏకగ్రీవంగా బూత్ సభ్యుల సమక్షంలో తీర్మానించారు.ఈ కార్యక్రమానికి ఏఆర్‌ఓ అగ్నిహోత్రం రవికిరణ్, పట్టణ అధ్యక్షులు మునుకోటి వెంకటేశ్వరరావు, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ కొప్పర్తి వెంకట్,పట్టణ ఉపాధ్యక్షులు సంగాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా వనమాల శ్రీనివాస్



నర్సాపురం,మేజర్‌న్యూస్ : జాతీయ బిసి సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏర్పాటులో భాగంగా ఆంధ్రప్రదేశ్ నూతన కమిటీలోకి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నర్సాపురం కు చెందిన ప్రముఖ న్యాయవాది, రాష్ట్ర అగ్ని, వన్నె కుల క్షత్రియ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనమాల శ్రీనివాస్ రెండవసారి ఎన్నికయ్యారు.జాతీయ అధ్యక్షులు ఆర్‌కృష్ణయ్య రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరావు, రాష్ట్రమహిళా అధ్యక్షురాలు ఎలాగల సూకణమ్మ ఆశీస్సులుతో ఈనియామకం జరిగింది.ఈసందర్భంగా నియామకపత్రం రాష్ట్ర కన్వీనర్ అండ్ ఇంచార్జి బోను దుర్గ నరేష్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాడ గణేష్ భవాని చేతులమీదుగా శ్రీనివాస్ అందుకున్నారు.ఈ సందర్భంగా జాతీయ బిసి సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాస్ ను గురువారంఆయన నివాసం వద్ద ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రెండవసారి ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు ఆర్ కృష్ణయ్య గార్కి, రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరావు యాదవ్,మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు ఎలాగల సూకనమ్మ, రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గ నరేష్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాడ గణేష్ భవానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాడ గణేష్ భవాని, నరసాపురం పట్టణ అధ్యక్షులు సందక రామకృష్ణ, ఉపాధ్యక్షులు మోకా శంకర్, ప్రధాన కార్యదర్శి కోలా కనకరాజు, సహాయ కార్యదర్శి కడలి ఆదినారాయణ,కట్టుంగనరేష్,కొల్లాటి సాంబమూర్తి రాజు,అద్దంకి వెంకటభాస్కర్,వాకలపూడి అప్పా రావు, రాజులపూడి సుధీర్, పట్నాల రమేష్, అయూబ్‌ఖాన్, కొల్లు దుర్గారావు,కామాడిగంగాద్రి,తమ్ము శేఖర్,బలగ కేదరేశ్వర రావు వివిధ కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పామాయిల్ ఫ్యాక్టరీలో తరచుగా జరుగుతున్న అగ్నిప్రమాదాలు



**పెదవేగి,మేజర్‌న్యూస్ :** పెదవేగిలోని పామాయిల్ ఫ్యాక్టరీ దగ్గర అగ్నిప్రమాదం జరిగింది. ఆయిల్ పామ్ కాళీ గెలల(బంచెస్)లకు నిప్పు అంటుకోవడంతో మంటలు భారీగా ఎగశాయి. అగ్ని మాపకశాఖాధి కారులు రాత్రంతా శ్రమించి, మంటలను అదుపులోకి తెచ్చాడు. పామాయిల్ ఫ్యాక్టరీలో గెలలనుంచి పండు తీసుకున్న తరువాత ఆ ఖాళీ గెలలను ప్యాక్టరీ ఆవరణ ఎదుట డంపింగ్ యార్డులో వేస్తారు. అక్కడ టన్నులకొద్ది పామాయిల్ వేస్ట్ ఉంది. కాగా బుధవారంరాత్రి పదకొండు గంటల సమయంలో డంపింగ్ యార్డునుంచి మంటలు వ్యాపించడంతో నిబ్బంది ఫ్యాక్టరీ మేనేజర్ సుధాకర్‌కు ఫోన్లో సమాచారం అందించారు. వెంటనే మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ మేనేజర్ వి.శ్రీనివాసరావులు ఏలూరు అగ్నిమాపకశాకాధికారులకు సమాచారం ఇచ్చి, ప్యాక్టరీ కాపాడాలని వేడుకున్నారు. రాత్రంతా మంటలను అదుపు చేయడానికి అగ్నిమాపకశాఖ నిబ్బంది అవస్థలు పడ్డారు. నూనెతో కూడిన పీచు కావడంతో మంటలు ఆడుపులోకి రాలేదు. ఒక పక్క నీటిని చల్లుతూ, మరోపక్క ఎక్స వేటర్లో పీచును పక్కకు తప్పిస్తూ రాత్రంతా కష్టపడి మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా డంపింగ్ యార్డులో పామాయిల్ వేస్ట్ దగ్గర మద్యం సీసాలు, వాటర్ బాటిల్స్, గ్లాసులు ఉన్నాయి. దీంతో ఎవ్వరో మద్యం తాగి, సిగరెట్ వంటివి వేసి ఉండవచ్చని ఆది నిప్పురగి మంటలు వ్యాపించి, డంపింగ్ యార్డులో బంచేసను దగ్ధం చేసినట్లు గుర్తించామని మేనేజర్ సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామాయిల్ ఫ్యాక్టరీ డంపింగ్ యార్డులో అగ్నిప్రమాదాలు తరచుగా జరుగుతున్నా అని ప్రమాదం జరిగిన ప్రతిసారి రూ.లక్షల్లో నష్టం వస్తోం దాని దీనిపై ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, ఇలా మందుబాబులు, ఆకతాయిలు కారంగా ఏదోక పక్క నుంచి అగ్నిప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని ఫ్యాక్టరీ మేనేజర్ సుధాకర్ విచారంగా చెప్పారు. డంపింగ్ రీరును పరిశీలించిన జీఏం. డంపింగ్ యారులో అగ్నిప్రమాదం సమాచారం తెలుసుకున్న జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ గురువార ఉదయం ప్యాక్టరీని సందర్శించారు. ప్రమాద సంఘటన వివరాలను మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు.

## స్వర్ణాంధ్రలో స్పేస్ టెక్నాలజీపై సదస్సు



**నరసాపురంరూరల్,మేజర్‌న్యూస్:** మండలంలోని సీతారాంపురం లో గల స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం స్పేస్ టెక్నాలజీపై సదస్సు నిర్వహించారు. ఈసీఈ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో తిరువనంతపురం స్పేస్ టెక్నాలజీ వారిచే నిర్వహించబడినఈ సదస్సులోశాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్ మాట్లాడుతూ శాటిలైట్‌ను ఎలా ప్రవేశ పడతారో అంతరిక్షంలో ఎలాపని చేస్తుంది అనే విషయాలను వివరించారు. ఈ సదస్సు ద్వారా ఇస్రోలో జరిగే ప్రయోగాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలోపాల్గొన్న రాజేంద్రవేజీని సత్కరించారు. కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి కొండ వీటి త్రినాద్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ కుమార్,వైస్ ప్రిన్సిపాల్ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కొయ్యలగూడెంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**కొయ్యలగూడెం,మేజర్‌న్యూస్:** 6వ తేదీ శుక్రవారం జంగారెడ్డి గూడెం 132 కె.వి.విద్యుత్ సబ్-స్టేషన్‌లో మరమ్మత్తులు చేస్తున్నందువల్ల ఉదయం 6గం నుంచి ఉదయం 9గం.ల వరకూ జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజన్‌లోని జంగారెడ్డిగూడెం మండలం,జీలుగుమిల్లి మండలం, కుక్కునూరు,వేలేరుపాడు, బుట్టాయగూడెం, కొయ్యల గూడెం మండలాల్లో విద్యుత్ సరఫరా ఆ సమయంలో నిలిపి వేస్తున్నట్లు జంగారెడ్డిగూడెం డి.ఈ. పీర్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. డి.ఈ.ఆదేశాల మేరకు కొయ్యలగూడెం మండలంలో విద్యుత్‌సరఫరానిలిపివేస్తున్నట్లు, వినియోగ దారులు సహకరించాలని కొయ్యలగూడెం, జంగారెడ్డి గూడెం ఏ.ఈ.లు కోరారు.

## నేడు పెదవేగి సెక్షన్ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం

**ఏలూరు,మేజర్ న్యూస్:** పెదవేగి మండలం, పెదవేగి సెక్షన్ పరిధిలో 33/11కెవి పెదవేగి సబ్ స్టేషన్ మరమత్తులు నిమిత్తము 6వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఎం.అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.దీనికారణంగా ఆసబ్‌స్టేషన్ పరిధిలో గల పెదవేగి, లక్ష్మీపురం,గార్లమడుగు ,సీతారామపురం ,కవ్వగుంట, ఎంఆర్‌సి కాలనీ ,సూర్యరావుపేట పరిసర ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. కనుక వినియోగదారులు ,వ్యవసాయ రైతులు గమనించి సహకరించవలసినదిగా అంబేద్కర్ కోరారు.

## శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి హుండీ లెక్కింపు



**పాలకొల్లు ,మేజర్ న్యూస్:** శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం పోలీసు , రెవెన్యూ శాఖల సమక్షమున దేవదాయ ధర్మదాయ తనిఖీదారు వి. వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో శ్రీ స్వామివారి ఆలయంలో గల హుండీలు తెరిచి లెక్కించగా 83 రోజులకు గాను రూ. 22,43,859/-లు ఆదాయం వచ్చిందని. శ్రీ క్షీర రామ సనాతన దాండియా గ్రూపు వారు శ్రీ హరే శ్రీనివాస కోలాట భజన మండలి సభ్యులు విశ్రాంత బ్యాంకు ,తపాలా శాఖ ఉద్యోగులు ఆర్ఎస్ శర్మ గ్రూపు సభ్యులు డిఎస్ ప్రకాష్ ఇరుసుమండ సభ్యులు దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు, అని ఆలయ కార్య నిర్వహణ అధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు తెలియ చేశారు,

## బుట్టాయిగూడెంలో 302 ఓట్లు పోలింగ్



బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్ : ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు మండలంలో గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నుండి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని మొత్తం 339 ఓట్లకు 302 ఓట్లు పోలయినట్లు తాసిల్దార్ చలపతిరావు తెలిపారు. 148 మంది పురుషులు 154 మంది స్త్రీలు ఓటు హక్కును వినియోగించుకున్నారని 89 శాతం పోలింగ్ నమోదయినట్లు ఆయన పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ఉమామహేశ్వరరావు తమ సిబ్బందితో గట్టి భద్రత ఏర్పాటు చేశారు.

## ఉత్తమ పరిశోధకుని అవార్డు ప్రధానం





కైకలూరు, మేజర్ న్యూస్, స్థానిక కైకలూరు వైవిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర శాకధిపతిగా పనిచేయుచున్న డాక్టర్ మంగళగిరి హరిప్రసాద్ కి జాతీయ విద్యా దినోత్సవం-2024 ఉత్తమ పరిశోధకుని అవార్డును అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన నాలెడ్జ్ రీసెర్చ్ అకాడమీ కోయంబత్తూర్ తమిళనాడు రాష్ట్రం వారు ఈ అవార్డును ప్రధానం చేశారు. ఆయన రాసిన పరిశోధన పత్రాలు, పుస్తకాలను పరిగణలోనికి తీసుకొని ఈ అవార్డును ప్రధానం చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ వై శ్రీలత అధ్యాపక, అధ్యాపక కేతర సిబ్బంది హరిప్రసాద్ కి అభినందనలు తెలిపారు.

# పేదల ఇళ్ల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి





### - పొలమూరు లేఅవుట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**పెనుమంట్ర,మేజర్ న్యూస్:** గురువారం పెనుమంట్ర మండలం పెనుమంట్ర భవిత ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ రిసోర్సెస్ సెంటరు (ఐఇఆర్ సి) లో ఏర్పాటు చేసిన ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ 109 పోలింగు కేంద్రాన్ని పరిశీలించి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి, ఉన్న మందులను పరిశీలన చేశారు.

బందోబస్తు చేస్తున్న పోలీసులకు జిల్లా కలెక్టరు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు నడుమ పోలింగు ప్రశాంతంగా జరుగుచున్నదన్నారు. నిర్మాణంలో ఉన్న తహాశీల్దారు కార్యాలయ భవనాన్ని పరిశీలించిన: జిల్లా కలెక్టరు. నిర్మాణం ప్రారంభించి, నిధుల కొరతతో నిలిచిపోయిన తహాశీల్దారు కార్యాలయ భవనాన్ని పరిశీలించి, వివరాలను జిల్లా కలెక్టరు అడిగి తెలుసు కున్నారు. బిల్డింగు పూర్తి చేయుటకు పూర్తి అంచనాలను సిద్ధం చేసి నివేదిక అందజేయాలని సంబంధిత అధికారుకు జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ సందర్భంలో జిల్లా గృహా నిర్మాణ శాఖ ఇన్చార్జి పిడి జి.పిచ్చయ్య, తహాశీల్దారు ఏ.వై.రవికుమార్, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ,పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేలలు బాగుంటే ఆరోగ్యవంతమైన పంటలు



**బుట్టాయి గూడెం, మేజర్ న్యూస్:** నేలలు బాగుంటే ఆరోగ్యవంతమైన పంటలు పండించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి డి.ముత్యాల రావు తెలిపారు. నేలల దినోత్సవం సందర్భంగా ఇప్పలపాడు లోని ఏకలవ్య మోడల్ స్కూల్‌లో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా ముత్యాల రావు మాట్లాడుతూ సారవంతమైన నేలల్లో ఆరోగ్యకరమైన పంటలు పండించుకునేందుకు అవకాశం ఉందన్నారు. మట్టి ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు.ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటిని మరిపించేలా వసతి గృహాలు ఉండాలి

- పసి హృదయాలను ఆదరించాలి - అనువైన వసతి ఏర్పాట్లు అవసరం
- భోజనానికి ముందు ప్రార్థన గీతాన్ని స్వయంగా ఆలపించిన జిల్లా కలెక్టర్





**పెనుమంట్ర,మేజర్‌న్యూస్:** జిల్లాలోని వసతి గృహాలలో మెరుగైన మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చదువులో మరింత రాణించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం పెనుమంట్ర మండలం పొలమూరు గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంలో జిల్లా కలెక్టర్ వసతి గృహం మొత్తం కలియ తిరిగిఅధికారులకు పలు సూచనలు చేశారు. వసతి గృహంలో అత్యవసర మరమ్మత్తులను వెంటనే చేపట్టాలని జిల్లా గృహనిర్మాణశాఖ అధికారిని ఆదేశించారు.వసతిగృహం ప్రాంగణం లో కొంతమేర దెబ్బతిన్న ప్రహరీ గోడ నిర్మాణా పనులను పరిశీలించారు. టాయిలెట్లను స్వయంగా పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం సమయం కావడంతో జిల్లా కలెక్టర్ పిల్లలతో సహపంక్తి భోజనం చేసి,ఆహార పదార్థాలను రుచి చూశారు.ప్రతిరోజు భోజనానికి ముందు పిల్లలు ఆలపించే ప్రార్థనా గీతాన్ని జిల్లా కలెక్టర్ స్వయంగా ఆలపించి, ఎలాపాడాలో పిల్లలకు నేర్పించారు.ఆమె ఈ గీతాన్ని ఎలా పాడగలిగారని విద్యార్థులు, అధికారులు ఒక్కసారిగా విస్మయానికి గురి అయ్యారు.విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనానికి కూర్చున్న సందర్భంలో ఒక పిల్లవాడు ప్రశ్నిస్తూ అమ్మ మీరు నాతో భోజనం చేస్తున్నారేంటి అని అడగడంతో, సమాధానం ఇస్తూ మీరు తల్లిదండ్రులకు దూరంగాఉంటూవసతిగృహాల్లో చదువు కుంటున్నారని ,అందరూ సమానమే అనే భావన మీలో కలిగించేందుకే నేను మీతో కలిసి భోజనం చేస్తున్నానని బదులిచ్చారు.

భోజనం చేస్తునంతసేపు విద్యార్థులతో కొన్ని విషయాలను ముచ్చటిస్తూ వారిలో సంతోషాన్ని నింపారు. వసతి గృహం స్లాబ్ మరమ్మత్తులు, నూతన టాయిలెట్స్ నిర్మాణానికి రూ.14.40 లక్షలు అంచనా వ్యయంతో ప్రతిపాదనలను పంపడం జరిగిందని, నిధులు మంజూరైన వెంటనే పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వసతి గృహం తనిఖీ సందర్భంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, పెనుమంట్ర తహశీల్దారు ఏ.వై.రవికుమార్, వసతిగృహా సంక్షేమ అధికారి ఎం.వి సూర్యనారాయణ, ఎంఈఓ వి.నారాయణ రావు, సర్పంచి కాకర రామేశ్వరరావు,తదితరులు ఉన్నారు.

# విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసిన కలెక్టర్ వెట్రిసెల్వి

- ఎంసియుపి స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసిన కలెక్టర్





**ఏలూరు,మేజర్‌న్యూస్:** మధ్యాహ్న భోజనం మెనూ ని ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. పవర్ పేట ఎంసి యు పి స్కూల్ లో గురువారం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మధ్యాహ్న భోజనంలో మెనూను ఖచ్చితంగా పాటించాలన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన సరుకులను వాడాలన్నారు. సరుకులతో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని రుచిచూసి, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ విద్యార్థినీ విద్యార్థులతో ముచ్చటించారు.అనంతరం మధ్యాహ్న భోజన పథకానికి వినియోగించే సరుకులస్టోర్‌ను కలెక్టర్ పరిశీలించారు. సరుకుల స్టాక్‌రిజిస్టర్‌ను పరిశీలించి వివరాలను ఉపాధ్యాయు లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల అటెండన్స్ రిజిస్టర్‌ను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లావిద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ, నగరపాలక సంస్థ ఉపకమీషనర్ చంద్రయ్య, ఎంఈఓలు రంగారావు, రవిప్రకాష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీహరి, ప్రభృతులు ఉన్నారు.

# నేటి నుండి కతోలిక న్యాయవాదుల జాతీయ సదస్సు

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** కతోలిక గురువులు,కన్యాస్త్రీలు న్యాయవాదులుగా దేశంలో రాణిస్తున్న విషయం తెలిసిందే. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాలకు చెందిన న్యాయ వాదులైన గురువులు,కన్యాస్త్రీలు 130మంది 6వ తేదీ శుక్రవారం ఏలూరు వస్తున్నారు. ఏలూరు పీఠాధిపతి,విశాఖ అగ్రపీఠ అపోస్తోలిక పాలనాధికారి,మోస్ట్ రెవ.బిషప్ జయరావు పొలిమేర ఆధ్వర్యంలో 3 రోజులు ఈ జాతీయ సదస్సు దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజి ప్రాంగణంలో జరుగుతుంది.ఈ సదస్సులో మోస్ట్ రెవ.జయరావు పోలిమర,ఒంగోలుసెషన్స్‌జడ్జి దున్నరాములు ,ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం, ప్రముఖ న్యాయవాది గొట్టుముక్కల రోనాల్డ్ రాజు, కీ నోట్ అడ్రస్ కొరకు మద్రాస్ హైకోర్టు సీనియర్ అడ్వకేట్ ఐసాక్ మోహన్‌లాల్ పాల్గొంటున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందినహైకోర్టు,సుప్రీం కోర్టులలో ప్రాక్టీస్ చేస్తు విస్తృతమైన సేవలందిస్తున్న వారు హాజరవుతున్నారు.ఈ కార్యక్రమాన్ని రెవ.టి.ఇమ్మానుయేలు (పిఆర్‌ఓ), రెవ.ఫా.పి.బాలకో-ఆర్డినేటర్),ఫా.జి.మోజెస్(డెంటల్‌కాలేజ్),రెవ.ఫా. ఇంజెపోలు (టీంమెంబర్)రెవ.ఫా:పి.జాకబ్(నర్సింగ్‌కాలేజ్)గా వ్యవహరించనున్నారు.

# నేడు కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలిపివేత

**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఈనెల 6వ తేదీన ఏలూరు 1వ పట్టణం పరిధిలో గల కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిదిలో విద్యుత్ లైన్ల దగ్గరగా గల చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమత్తుల నిమిత్తం ఈనెల 6వ తేదీ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపదల చేయబడునని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఏం.అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమయంలో కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో గల కోటదిబ్బ, మెయిన్ బజార్,పాండురంగ థియేటర్, అగ్రహారం, మార్కెట్, కెనాల్ రోడ్, సత్యనారాయణ పేట,లంబాడి పేట, వెన్నవల్లి వారి పేట, భావిశెట్టి వారి పేట నల్ల దిబ్బ పరిసర ప్రాంతాలలో పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడు తుందన్నారు. కనుక వినియోగ దారులు సహకరించవలసినదిగా అంబేద్కర్ కోరారు.

# రక్త దానం కోసం ఉద్యమిద్దాం : జిల్లా కలెక్టర్



**భీమవరం,మేజర్‌న్యూస్:** పశ్చిమ గోదావరి జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు, జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి పిలుపు.వినూత్న, మార్గదర్శక ప్రయత్నంలో జిల్లాలో రక్తదాన శిబిరాలు ఎక్కువగా నిర్వహించి రక్తాన్ని సేకరించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజల నుండి స్వచ్ఛందంగా రక్తాన్ని సేకరించేందుకు ప్రతి ప్రభుత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతి 15 రోజులకు ఒక శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అధికారులు, సిబ్బంది ముందుకు రావాలన్నారు. ఆపద, అత్యవసర సమయంలో ఉన్న రోగులకు అందించి వారి ప్రాణాలను కాపాడ వలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించడానికి,దాని క్లిష్ట ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి రూపొందించబడిన కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌లో ఇదే మొదటిది అన్నారు. ప్రతి శిబిరంలో ప్రభుత్వ ఉద్యోగులు, స్థానిక నివాసితులకు ఒకచోటచేరి,రక్తదానం చేయడానికి ,అవసరమైన వారి శ్రేయస్సుకు దోహదపడే అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో, శస్త్ర చికిత్సలు,వైద్య చికిత్సల్లో ప్రాణాలను కాపాడేందుకు రక్తం ఒక ముఖ్యమైన వనరులు అన్నారు.ఈ ప్రాణదాత మిషన్‌కు తోడ్పాటు నందించేందుకు, ఆంధ్రప్రదేశ్‌లో స్వచ్ఛంద రక్తదానానికి పశ్చిమగోదావరి జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరం కలిసి కృషి చేద్దామని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి ఆ ప్రకటనలో తెలిపారు.

# ఆక్వా రైతులు సాధికారతకై వాటర్‌బేస్ ఆధ్వర్యంలో ఆక్వా మీట్స్

**భీమవరం,మేజర్‌న్యూస్:**ఆక్వారైతులలో అవగాహనను పెంపొందించ డానికి,సుస్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడానికి వాటర్‌బేస్ దేశ వ్యాప్తంగా ఆక్వామీట్స్ నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ ప్రతినిధి దుర్గాప్రసాద్ చెప్పారు.కళింగపేటలోని ఎస్‌హెచ్‌కే ఆక్వాఫీడ్స్‌వద్ద జరిగిన ఆక్వామీట్‌లో ఆయన మాట్లాడుతూ భారతదేశ ఆక్వాకల్చర్ రంగం,ముఖ్యంగా రొయ్యల పెంపకం ఇటీవలి సంవత్సరాలలో చెప్పుకోదగ్గ అభివృద్ధిని సాధించిం దన్నారు. వీటన్నింటికి ఆధారమైన, పర్యావరణం, వనరులు సమాజం పట్ల ఆక్వా రైతులు శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొవటానికి, వాటర్‌బేస్ ఆక్వామీట్స్ అనేవి రొయ్యల రైతులకు మంచి యాజమాన్య పద్ధతులు మరియు సుస్థిరమైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఉద్దేశించినవన్నారు.

ఈ కార్యక్రమాలు రైతులకు రొయ్యలవ్యాధి నివారణచర్యలుపాటించి దిగుబడిని పెంచడం,పర్యావరణాన్ని కాపాడుతూ, ఆక్వాకల్చర్ పెరుగు దల, సుస్థిరత్వం మధ్య సమతుల్యతను పెంపొందించే పద్ధతులను వివరిస్తున్నాయన్నారు.ఆక్వామీట్స్‌లలో రైతులు వారి ఆలోచనలను పంచు కోవడమే కాకుండా,నిపుణుల నుండి కూడా సలహాలను పొందవచ్చునని, రొయ్యల పెంపకంలో సరికొత్త సాంకేతిక పద్ధతులు తెలుసుకోవచ్చు



నన్నారు. ఆక్వామీట్‌లలో సుస్థిరత,సరైన యాజమాన్య పద్ధతులు అనేవి ప్రధాన అంశాలుగా ఉన్నాయనీ, ఆరోగ్యకరమైన రొయ్యల పెరుగుదల అనేది చెరువును సరైన రీతిలో సిద్ధం చేయడంపై ఆధారపడి ఉంటుందనీ,ఆక్వామీట్స్ చెరువు తయారి, నీటి నాణ్యతను కాపాడటం, ఉపయోగకరమైన బ్యాక్టీరియా పెంపొందించడం వంటి మెరుగైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడం ద్వారా సుస్థిరమైన ఆక్వాకల్చర్ కు పునాది వేస్తుందని చెప్పారు.